క్లుప్తంగా

తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు



పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు తప్పుడు ప్రచారంతో లబ్ధిదారులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణంలో తొమ్మిది పిల్లర్లతో డబుల్ బెడ్‌రూం, కిచెన్, హాలు ఉంటుందన్నారు. లబ్ధిదారులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారులను సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి



ఆర్మూర్‌టౌన్: విత్తన దుకాణాల నిర్వాహకులు నాణ్యమైన ఎరువులనే రైతులకు విక్రయించాలని ఏసీపీ వేంకటేశ్వర్‌రెడ్డి, ఏవో హరికృష్ణలు సూచించారు. పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను శనివారం వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి వాటి బిల్లులను తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడే పార్టీ సీపీఐ



రుద్రూర్: పేదల కోసం నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ అని మండల కార్యదర్శి విఠల్ గౌడ్ అన్నారు. కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో శనివారం సీపీఐ గ్రామ కార్యదర్శి గోపాల్ రావ్ ఆధ్వర్యంలో పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం శాఖ మహసభ నిర్వహించారు. ఈసందర్భంగా విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. సుద్దులంలో పేదల పక్షాన భూపోరాటం చేసి వందల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు నల్ల గంగాధర్, శంకర్, బాబురావ్, లక్ష్మణ్, సాయిలు, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచడంపై పోతంగల్ మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శనివారం పోతంగల్ బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు భజరంగ్ హన్మాండ్లు, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మక్కయ్య, బాన్సువాడ సెగ్మెంట్ ఓబీసీ కన్వీనర్ నాగం సాయిలు, శోక్, శంకర్, విజయ్, కిరణ్, దిగంబర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



నవీపేట: ఆధునిక కంప్యూటర్ యుగంలో మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ భారతి సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం జరిగిన మహాజన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల బలోపేతానికి పుస్తక నిర్వహణ పారదర్శంగా ఉండాలన్నారు. లా వాదేవీలను క్రమం తప్పకుండా తోటి సభ్యులతో చర్చించాలని సూచించారు. ఐకేపీ డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, కల్చరల్ కో–ఆర్డినేటర్ అష్ట గంగాధర్, సీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల సీజ్

నవీపేట్: మండలంలోని నిజాంపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను తహసీల్దార్ వెంకటరమణ శనివారం సీజ్ చేశారు. కొంతకాలంగా వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకొచ్చి గ్రామంలోని పలువురు ఇళ్ల ముందు డంప్ చేశారు. డంప్ చేసిన ఇసుకను రాత్రివేళల్లో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో 60 కుప్పలను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట గిర్దావర్ నరేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సంతలో సమస్యల చింత

- నందిపేటలో కనీస సౌకర్యాలు లేక ప్రజల ఇబ్బందులు
- తైబజార్ ద్వారా ఆదాయం వస్తున్నా పట్టించుకోని అధికారులు



సంతలో ఏర్పడిన ట్రాఫిక్ జామ్



నందిపేటలో జరుగుతున్న సంత

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో జరుగుతున్న సంతలో సమస్యలు నెలకొన్నాయి. ప్రతి సోమవారం జరిగే సంతకు చుట్టుపక్కల సుమారు 60 గ్రామాల నుంచి రైతులు, చిరు వ్యాపారులు ఈ సంతకు వస్తారు. అయితే సంతలో కనీసం సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిపోతున్న చోరీలు..

ప్రతి సంవత్సరం తైబజార్ వేలం ద్వారా రూ. లక్షల్లో ఆదాయం సమకూరుతున్న కనీస సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీనికితోడు సంతలో రోజురోజుకు దొంగతనాలు పెరిగిపోతున్నాయి. సంతకు వచ్చే కొనుగోలుదారుల నుంచి విలువైన సెల్‌ఫోన్లు, పర్సులు చోరీకి గురువుతున్నాయి. అసలే ఇరుకు రోడ్డు ఆపై సంతలోకి కార్లు, ఆటోలు తీసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా నెలకొంటుంది. పోలీసుల పర్యవేక్షణ కరువవుతుంది. సంతలో సమస్యలతో పాటు దొంగతనాలను, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం..

నందిపేట అంగడి బజార్‌లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే మరుగుదొడ్లను సైతం త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, నందిపేట

నిఘా పెంచుతాం..

సంతలో దొంగతనాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. మఫ్టీలో పోలీసు సిబ్బందితో నిఘా ఉంచి దొంగలను పట్టుకుంటాం. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడతాం. – చిరంజీవి, ఎస్సై, నందిపేట

మరమ్మతులు చేపట్టండి



జన్నెపల్లి వాగుపై ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి



బ్రిడ్జి అంచుల వెంబడి కూలిపోయిన దిమ్మెలు

నవీపేట: మండలంలోని జన్నెపల్లి వాగుపై దశాబ్దాల కిందట నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. నవీపేట, నందిపేట, మాక్లూర్ మండలాలకు వారధిగా ఉన్న ఈ బ్రిడ్జి మూడేళ్ల కిందట కుంగిపోయింది. బ్రిడ్జిపై వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో పలువురు వాహనదారులు బ్రిడ్జి వద్ద అదుపుతప్పి వాగులో పడి గాయాల పాలయ్యారు. కొన్ని నెలల క్రితం అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పటికైనా స్పందించి బ్రిడ్జికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంతర్గత రోడ్లు పూర్తి అధ్వానంగా మారాయి. గుంతలు, రాళ్లు తేలిన మార్గాల్లో ప్రయాణం సాగించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. పట్టణంలోని జిరాయత్‌నగర్ వెళ్లే రోడ్డు, హుస్నాబాద్ కాలనీ నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లేదారి, టెక్ మజీద్‌కు వెళ్లేదారి, ఇలా పలు వార్డుల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. మరికొన్ని చోట్ల ఇంటి యజమానులు పైప్‌లైన్ కోసం రోడ్లను ధ్వంసం చేసి, మరమ్మతులు చేయడం మర్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన కూరగాయల మార్కెట్‌కు వెళ్లేదారి



జిరాయత్‌నగర్‌కు వెళ్లే రోడ్డు

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి





రుద్రూర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది.. సోన్‌పేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, కూలీలు



బోధన్‌లో మాట్లాడుతున్న జడ్జి పూజిత

బోధన్: పొగాకు సంబంధిత పదార్థాలకు యువత దూరంగా ఉండాలని బోధన్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత అన్నారు. పొగాకు రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి పూజిత హాజరై మాట్లాడారు. పొగాకు వాడకంతో కలిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో ప్రజలు, యువతకు అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్: పొగాకు ఉత్పత్తులను సేవించడం పలు అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి ఆయేషా సిద్ధికా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు ఉత్పత్తులు వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు.

మెండోరా మండలంలో..

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల్లో శనివారం పోచంపాడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బీడి, సిగరేట్ తాగడంతో జరిగే నష్టాలను వైద్యాధికారి రాకేశ్ వివరించారు. పొగాకు వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఈ ఏపీఎం మాకొద్దు..!



ఏపీఎంను నిలదీస్తున్న రెంజల్ మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షులు

రెంజల్(బోధన్): నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రెంజల్ ఏపీఎం మాకొద్దని మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షులు లక్ష్మి, గంగామణిలు అన్నారు. రెంజల్‌లోని ఐకేపీ కార్యాలయానికి శనివారం వారు చేరుకుని ఏపీఎం చిన్నయ్యను నిలదీశారు. మండలంలోని 31 వీవోలు ఉండగా ఏపీఎం పర్యవేక్షణ లేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే పదవుల నుంచి తొలగిస్తు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పాలకవర్గానికి తెలియకుండా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీఎంతోపాటు సిబ్బంది పూర్తిగా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈవిషయమై ఏపీఎం చిన్నయ్యను విలేకరులు వివరణ కోరగా నిబంధనలు, బైలా ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కేజీబీవీకి నూతన భవనం అప్పగించేదెప్పుడు?

- అద్దె భవనంలో ముప్కాల్ విద్యాలయం
- బడుల పున:ప్రారంభం కంటే ముందే సొంత భవనంలోకి మారిస్తే మేలు



ముప్కాల్‌లో పూర్తయిన కేజీబీవీ భవనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలో బడులు పునఃప్రారంభం కానుండగా నూతన భవనాన్ని కాంట్రాక్టర్ పాఠశాల యాజమాన్యానికి అప్పగించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు అప్పగించడానికి ఉన్న సమస్య లేంటో అర్థం కావడం లేదు.

తప్పనున్న ఇబ్బందులు..

మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల 2018 నుంచి అద్దె భవనంలో కొనసాగుతుంది. ఏళ్ల విద్యార్థులు, సిబ్బంది అద్దె భవనంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఈ విద్యా సంవత్సరం ఖచ్చితంగా నూతన భవనంలో నిర్వహించేలా పనులు పూర్తిచేశారు. కాంట్రాక్టర్ నుంచి యాజమాన్యానికి భవనం అప్పగిస్తే ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. మరో 12 రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈక్రమంలో నూతన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవనం ప్రారంభానికి మళ్లీ సమయం తీసుకుంటే విద్యార్థులకు అద్దె భవనంలో తిప్పలు తప్పవు. ముప్కాల్‌లో ఏడాదిన్నర క్రితం పూర్తయిన పల్లె దవాఖానా భవనం, కేజీబీవీ భవనంను ఒకేసారి ప్రారంభించుటకు పాలకులు ప్రణాళికలు చేస్తున్నట్లు సమచారం. కానీ ముందుగా అప్పగింత పూర్తయితే తర్వాత కార్యక్రమం ముందుకు సాగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే అప్పగిస్తాం..

ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనం పనులు పూర్తయ్యాయి. త్వరలోనే పాఠశాల యజమాన్యానికి భవనాన్ని అప్పగిస్తాం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభిచేలా చర్యలు తీసుకుంటున్నాం.
– మురళి, కేజీబీవీ భవనాల ఏఈ, నిజామాబాద్

ఘనంగా అహల్యాబాయి జయంతి



రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలో శనివారం లోకమాత అహల్యాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో అహల్యాబాయి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మహిళా సాధికారత కోసం ఆమె చేసి సేవలను వివరించారు. అనంతరం గంగాహారతి నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా బ్రిడ్జి

నేటి చిత్రం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రంగచారి కాలనీలో నిజాంసాగర్ కెనాల్‌పై గల బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు రాకపోకలు సాగించడానికి జంకుతున్నారు. అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.
– టి శ్రీనివాస్, రంగచారి కాలనీ, ఆర్మూర్

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలి





ఆలూర్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు.. బోర్గాంలో ఇళ్ల పత్రాలను అందజేస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులకు అధికారులు సూచించారు. మండలంలోని బోర్గా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు శనివారం అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు మంజూరు పత్రాలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మొదటి విడతలో మంజూరు లభించని నిరుపేదలకు రెండో విడతలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంజూరు చేయిస్తారని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, ఎంపీడవో వెంకటేశ్‌జాదవ్, కాంగ్రెస్ నాయకులు సాయరెడ్డి, దనుంజయ్, మొయినోద్దిన్, కార్తీక్‌యాదవ్, సుంచుల రాములు, సాయిలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో శనివారం పలువురి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, ఎంపీడీవో గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ వైస్ మల్లా రెడ్డి, అమందు సంజీవ్, పెండ భాస్కర్, కుర్మే చిరంజీవి, నారాయణ, నవనీత్, గంగా రెడ్డి, జీపీ కార్యదర్శి రాజ లింగం, తిరుపతిరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన కడమల ప్రభాకర్ (57) అదృశ్యమైనట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. శుక్రవారం తహసీల్ కార్యాలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ప్రభాకర్ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. కొడుకు భాను భూషణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రుద్రూర్: పోతంగల్‌లోని బాలజీ మందిరం 20వ వార్షికోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు హన్మంత్‌రావ్ జోషి, శ్రీనివాస్‌రావ్ జోషి, ఆలయ అర్చకుడు సుధీర్ త్రిపాఠి, చంద్రశేఖర్, విఠల్‌గుప్తా పాల్గొన్నారు.



బాలాజీ మందిరంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 కరాటే కిడ్ లెజెండ్స్-11.20, 5.10.35
ఖలేజా-1.35, భైరవం-7.25

స్క్రీన్-4 భైరవం-10.25, 4.20, 10.15
సింగిల్-1.35, 7.30

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

డిగ్రీ కళాశాలలో సీట్ల కేటాయింపు పూర్తి

వర్ని: మండలంలోని పాత వర్నిలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ ప్రవేశాలకు సీట్లు కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మజ శనివారం వెల్లడించారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6లోపు కళాశాలలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును విరమించుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టనున్న ఉపాధ్యాయుల సర్దుబాటును వెంటనే విరమించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య సాధ్యమవుతుందన్నారు. ప్రతి ప్రైమరీ పాఠశాలకు ఒక ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంను ఏర్పాటు చేయాలన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో శనివారం జాయింట్ యాక్షన్ ఆఫ్ ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి విరాళం

వర్ని: మోస్రా మండలం చింతకుంట గ్రామంలోని అనాథ వృద్ధాశ్రమానికి శనివారం జిల్లా చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కేపీఎస్ రెడ్డి కు మారుడు వెంకటరామరెడ్డి జ్ఞాపకార్థం రూ.1లక్ష చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

బోధన్: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన బెల్లంకొండ జయరాజు బోధన్ ఆర్టీసీ డిపోలో కండక్టరు విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విమరణ పొందారు. ఈసందర్భంగా శనివారం స్వగ్రామంలో ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రెంజల్(బోధన్): రెంజల్‌తో పాటు తాడ్‌బిలోలి గ్రామంలోని పలు బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు సాయరెడ్డి, దనుంజయ్, రాములు, నర్సయ్య, సాయిబాబగౌడ్, ఆసాని అనీల్, ఇందిరారెడ్డి, యోగేశ్, కార్కన శ్రీను, సాయాగౌడ్, పోచయ్య, శ్రీనివాస్‌యాదవ్, సగ్గ వెంకటి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవీపేట: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం జరిగిన మహాజన సభలో సెర్ప్ ఏపీఎం భారతి సమక్షంలో మండల స్థాయి మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జ్యోతి(నవీపేట), కార్యదర్శిగా లక్ష్మి (నాగేపూర్), కోశాధికారిగా సుశీల(జన్నెపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: నవీపేట మండలం మద్దెపల్లి శివారులోని తన ఏడెకెరాల వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నారని భూయాజమాని సింహాద్రి వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. అధికారులు స్పందించి తన భూమిని కాపాడాలని కోరారు.